


పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి: కలెక్టర్

పార్వతీపురం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆయన మాట్లాడుతూ.. పరిశ్రమల స్థాపన కోసం వచ్చిన దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకోవాలని తెలిపారు. సింగిల్ డెస్క్ విధానంలో వచ్చిన 26 దరఖాస్తుల్లో 19 మంజూరు చేశామని, మిగిలిన ఏడు దరఖాస్తులను కూడా గడువు లోపల పరిష్కరించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి కరుణాకర్, డీపీవో బి.సత్యనారాయణ, జిల్లా మత్స్యశాఖ అధికారి వి.తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. కల్యాణం

- గోవింద నామస్మరణతో పులకించిన తోటపల్లి
- వైభవంగా వేంకటేశ్వరస్వామి పరిణయ మహోత్సవం
- భారీగా తరలివచ్చిన భక్తులు



వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపిస్తున్న అర్చకులు



అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు



కల్యాణ మహోత్సవానికి హాజరైన భక్తజనం

గరుగుబిల్లి, ఫిబ్రవరి 20

ఉత్తరాంధ్రలో చినతిరుపతిగా ప్రసిద్ధిగాంచిన తోటపల్లిలో వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం మంగళవారం రాత్రి వైభవంగా జరిగింది. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు పలు ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు. ముందుగా ఉదయం సుప్రభాత సేవ, ఆరాధన, మంగళ శాసనములు, విశేష హోమాలు, శాత్తుముర్రై, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 9 గంటలకు ఎదురు సన్నాహోత్సవంతో పాటు స్వామివారి తిరువీధి మహోత్సవం జరిపారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ప్రముఖ యజ్ఞ యాగకర్త శర్మయాజీ పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకులు అప్పలాచార్యులు, శశిధర్, ఫణిధర్, గౌతమ్, మణిహారం శేషాచార్యులు స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవో వీవీ సూర్యనారాయణ, ఆలయ ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ సత్యనారాయణ, దేవస్థానం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వీరి ఇళ్లు ఎప్పుడో?

- ఆవేదనలో టిడ్కో ఇళ్ల లబ్ధిదారులు
- నెరవేరని సొంతింటి కల
- రూ.500 చెల్లించిన వారి గృహ నిర్మాణాలే ఇంకా సాగుతున్న వైనం
- రూ.25వేలు, రూ.50 వేలు జమ చేసిన వారి ఇళ్ల పనులు ప్రారంభించేదెప్పుడో..
- ఏళ్లు గడుస్తున్నా.. డబ్బులూ చెల్లించని వైనం
- అప్పులకు వడ్డీలు కట్టలేక అవస్థలు
- ఎన్నికలకు సమీపిస్తున్న సమయం
- పట్టించుకోని సర్కారు



అడ్డాపుశీల వద్ద నిర్మాణంలో ఉన్న రూ.500లు చెల్లించిన లబ్ధిదారుల ఇళ్లు

(పార్వతీపురం టౌన్, ఫిబ్రవరి 20)

టిడ్కో ఇళ్ల నిర్మాణం తమ గొప్పతనమే అని చెప్పుకుంటున్న వైసీపీ సర్కారు లబ్ధిదారులకు తీరని ఆవేదనను మిగిలిస్తోంది. ఇప్పటికీ ఇళ్లను అప్పగించకపోగా.. వారు జమ చేసిన డబ్బులు కూడా తిరిగి చెల్లించడం లేదు. దీంతో పేదలు లబోదిబోమంటున్నారు. వాస్తవంగా గత నాలుగున్నరేళ్ల నుంచి వాటి ఊసెత్తని ప్రభుత్వం.. ఎన్నికల సమీపిస్తున్న వేళ టిడ్కో ఇళ్ల పంపిణీపై దృష్టి సారించింది. దీంతో అధికారులను పరుగులెత్తిస్తోంది. జిల్లాకేంద్రం విషయానికొస్తే.. రూ.500 చెల్లించిన లబ్ధిదారుల గృహ నిర్మాణాలు ఇంకా కొనసాగుతున్నాయి. వాటి ప్రారంభించడానికి రంగం సిద్ధం చేస్తుండగా.. మౌలిక వసతుల సంగతిని మాత్రం అధికారులు మరిచారు. రోడ్లు, కాలువలు, విద్యుత్, తాగునీరు వంటి సదుపాయాలు లేకుండా అక్కడెలా ఉండగలమని పలువురు లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. ఇదిలా ఉండగా టిడ్కో ఇళ్ల కోసం అప్పులు చేసి మరీ రూ. 25 వేల నుంచి రూ.50 వేల వరకు చెల్లించిన వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఇంతవరకు ఆ ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించలేదు. కనీసం వారు కట్టిన డబ్బులు కూడా చెల్లించలేదు. ఏళ్లు గడుస్తున్నా... అతీగతీ లేకపోవడంతో ఆయా లబ్ధిదారులు మరింత ఆందోళన చెందుతున్నారు. రూ.500 చెల్లించిన లబ్ధిదారుల గృహనిర్మాణాలు ప్రారంభానికి సిద్ధమవుతుండగా.. తమ పరిస్థితేమిటని వారు సర్కారును ప్రశ్నిస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

పేద, మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కలను నెరవేర్చేందుకు గత టీడీపీ ప్రభుత్వం హయాంలో టిడ్కో గృహ నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. జిల్లా కేంద్రానికి అతి సమీపంలోని పార్వతీపురం మండలం అడ్డాపుశీల గ్రామం వద్ద పనులు ప్రారంభించారు. పట్టణంలోని 30 వార్డుల్లో ఉన్న పేద కుటుంబాలకు చెందిన 768 మందిని లాటరీ పద్ధతిలో ఎంపిక చేశారు. ఈ మేరకు రూ.500 చొప్పున లబ్ధిదారుల వాటాగా గృహ నిర్మాణశాఖ అధికారులు కట్టించుకున్నారు. మధ్య తరగతి కుటుంబాలకు చెందిన 240 మందితో రూ. 25వేలు, 382 మందితో రూ. 50 వేలు చొప్పున మున్సిపల్ కమిషనర్ ఖాతాలో జమచేయించారు. ఆ తర్వాత గృహ నిర్మాణాలకు అడుగులు పడ్డాయి. ఇంతలో ఎన్నికలు జరగడం.. వైసీపీ పాలన పగ్గాలు చేపట్టడంతో సీన్ మారింది. రూ.25 వేలు, రూ.50 వేలు చెల్లించిన మధ్య తరగతి లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలకు మాత్రం బ్రేక్ పడింది. రూ.500 చెల్లించిన లబ్ధిదారుల గృహ నిర్మాణాలు కొనసాగుతుండగా.. నాలుగున్నరేళ్ల తర్వాత వాటి ప్రారంభోత్సవానికి సర్కారు చర్యలు తీసుకోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రూ.2.30 కోట్లు ఏమయ్యాయి?

టిడ్కో ఇళ్ల కోసం మధ్యతరగతి ప్రజలు చెల్లించిన రూ.25 వేల నుంచి రూ.50 వేలు మున్సిపల్ కమిషనర్ ఖాతాలో ఉన్నాయా..లేవా...అన్నది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. పట్టణంలోని 30 వార్డుల్లో 364 అడుగుల చదరపు విస్తీర్ణానికి సంబంధించి రూ. 25 వేలు చెల్లించిన వారు 240 మంది ఉన్నారు. 430 అడుగుల విస్తీర్ణానికి సంబంధించి రూ. 50 వేలు చెల్లించిన వారు 382 మంది ఉన్నారు. వారంతా ఇళ్ల కోసం సుమారు రూ. 2.30 కోట్లు మున్సిపల్ కమిషనర్ ఖాతాలో జమ చేశారు. అయితే వైసీపీ ప్రభుత్వం తమ సొంతింటి కలను నెరవేరుస్తుందని వేచి చూసిన వారికి నిరాశే ఎదురైంది. రూ.500లు చెల్లించిన లబ్ధిదారుల టిడ్కో ఇళ్లు పూర్తి అవుతుండడంతో రూ. 25వేలు, రూ.50 వేలు చెల్లించిన లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ఎన్నికలకు సమయం సమీపిస్తుండడంతో తమ గృహాల నిర్మాణం జరిగేనా అని వారు మథనపడుతున్నారు. ఇప్పటివరకు ఆ పనులేవీ చేపట్టనందున తాము కట్టిన డబ్బులు వాపసు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ సింహాచలంను వివరణ కోరగా రూ.25 వేలు, రూ.50 వేలు చెల్లించిన లబ్ధిదారులకు సంబంధించి ఇళ్ల నిర్మాణాలు చేపట్టకపోతే డబ్బులు తిరిగి చెల్లిస్తామని చెప్పారు.

ప్రభుత్వం స్పందించాలి



సొంతింటి కలను నెరవేర్చుకోవాలనే ఆశతో టిడ్కో ఇంటి కోసం రూ. 25 వేల వరకు ప్రభుత్వానికి డిపాజిట్ చేశాం. అయితే ఏళ్లు గడుస్తున్నా.. ఇప్పటివరకు గృహ నిర్మాణాలు చేపట్టడం లేదు. మా డబ్బులు కూడా ఇవ్వడం లేదు. మాలాంటి మధ్యతరగతి కుటుంబాలకు అన్యాయం చేయడం తగదు. దీనిపై వైసీపీ సర్కారు, అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలి.

-సత్యనారాయణ, టిడ్కో లబ్ధిదారుడు, పార్వతీపురం

న్యాయం చేయాలి..



సొంతింటి కల నెరవేరుతుందని అప్పు చేసి రూ.25 వేల వరకు ప్రభుత్వానికి చెల్లించాం. అయితే ఇంతవరకు టిడ్కో ఇల్లు లేదు.. కట్టిన డబ్బులూ లేవు. మేము చెల్లించిన డబ్బులు కమిషనర్ ఖాతాలో ఉన్నాయని ప్రజాప్రతినిధులు, అధికారులు చెబుతున్నారే తప్ప మాకు ఇవ్వడం లేదు. మాకు న్యాయం చేసేలా చర్యలు చేపట్టాలి.

-రాజశేఖర్, టిడ్కో లబ్ధిదారుడు, పార్వతీపురం



పార్వతీపురంలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నాయకులు

దాడి అమానుషం

- 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ మూకల దుశ్చర్యను ఖండించిన జర్నలిస్టులు
- జిల్లాలో రెండోరోజూ కొనసాగిన నిరసనలు
- టీడీపీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం

పార్వతీపురం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా రాప్తాడులో ఆదివారం వైసీపీ నిర్వహించిన సిద్ధం బహిరంగ సభలో 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకల దాడి అమానుషమని జర్నలిస్టులు అన్నారు. వైసీపీ మూకల తీరును వ్యతిరేకిస్తూ జిల్లాలో రెండో రోజు మంగళవారం కూడా ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. జర్నలిస్టులకు రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వం దాడులను ప్రోత్సహించడం సిగ్గుచేటన్నారు. కురుపాం, జియ్యమ్మవలసలోని తహసీల్దార్ కార్యాలయాల ఎదుట పాత్రికేయులు నిరసన తెలిపారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అధికారులకు వినతిపత్రాలు అందించారు. పార్వతీపురంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద శ్రేణులతో కలిసి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బోనెల విజయచంద్ర నిరసన తెలిపారు. సర్కారుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చారు. వాస్తవలను నిర్భయంగా బయటపెడుతున్న 'ఆంధ్రజ్యోతి'పై ప్రభుత్వం కక్ష కట్టిందన్నారు. దీనిలో భాగంగానే వైసీపీ నాయకులు, కార్యకర్తలతో దాడులు చేయిస్తుందని ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో పత్రికా స్వేచ్ఛకు ఆటంకం కలిగించే ప్రభుత్వాలు భూస్థాపితం కాక తప్పదన్నారు. ఈ నిరసనలో టీడీపీ నాయకులు బడే గౌరునాయుడు, కె.నారాయణరావు, జి.రవికుమార్, బార్నాల సీతారాం, కోలా మధుసూదనరావు, సింహాచలంనాయుడు తదితరులు పాల్గొన్నారు.



పార్వతీపురంలో ర్యాలీ చేస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు

నిరసన హోరు

- రోడ్డెక్కిన ఉద్యోగ, ఉపాధ్యాయులు
- జిల్లాకేంద్రంలో భారీ ర్యాలీ
- కలెక్టరేట్ ఎదుట ధర్నా
- వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు
- సమస్యలు పరిష్కరించాలని, హామీలు నెరవేర్చాలని డిమాండ్

బెలగాం, ఫిబ్రవరి 20: ఉద్యోగ, ఉపాధ్యాయులు కదంతొక్కారు. సర్కారుకు వ్యతిరేకంగా నిరసన స్వరం పెంచారు. గతంలో సీఎం జగన్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం పార్వతీపురంలో పెద్దఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. ముందుగా పట్టణంలోని జిల్లా ప్రభుత్వ కార్యాలయాల సమూహం నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పాదయాత్రలో సీఎం జగన్ ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ఉద్యోగ, ఉపాధ్యాయులపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని జేఏసీ నాయకులు ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే సీపీఎస్ రద్దు చేస్తామని చెప్పి.. మాట తప్పారని.. నేడు ఆ ఊసే ఎత్తకపోవడం దారుణమన్నారు. పీఎఫ్, జీపీఎఫ్ డబ్బులను ఇవ్వకుండా ప్రభుత్వం వాటిని దారి మళ్లించి వేరే కార్యక్రమాలకు ఉపయోగించుకోవడం న్యాయమా? అని వారు ప్రశ్నించారు. రిటైర్మెంట్ అయిన వారికి 2027లో గ్రాట్యుటీ ఇస్తానని జీవోలు ఇవ్వడం ఎంతవరకు సమంజసమన్నారు. సీపీఎస్ బదులు జీపీఎస్ ఇస్తామంటూ ప్రభుత్వం ఉద్యోగులను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తోందన్నారు. తక్షణమే ఓపీఎస్ పునరుద్ధరించాలని, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, డీఏలు, ఆర్థిక బకాయిలు చెల్లించా లని, ఐఆర్ 30 శాతం ప్రకటించాలని, హెల్త్, పోలీస్ శాఖల ఉద్యోగులకు అలవెన్స్‌లు ఇవ్వాలని నినాదాలు చేశారు. సర్కారు దిగి రాకుంటే ఈ నెల 27న పెద్దఎత్తున ధర్నా చేస్తామని, గతంలో విజయవాడలో చేసిన నిరసన మళ్లీ పునరావృతం అవుతుందని వారు హెచ్చరించారు. ఈ నిరసనలో జేఏసీ నాయకులు ఎస్.మురళీ, జి.జగ న్నాథం, డి.గణపతిరావు, సీహెచ్ శంకర్రావు, దుర్గ, సత్యనారాయణ, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, సచివాలయ ఉద్యో గులు, వైద్య, ఆరోగ్య సిబ్బంది, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

శంబరకు పోటెత్తిన భక్తులు

- ఘనంగా ఐదో వారం జాతర
- పోలమాంబ దర్శనానికి బారులు

మక్కువ/సాలూరు రూరల్, ఫిబ్రవరి 20: శంబరకు మంగళవారం భక్తులు పోటెత్తారు. ఐదోవారం జాతర సందర్భంగా పరిసర ప్రాంతాల నుంచి 25 వేల మందికి పైబడి తరలివచ్చారు. దీంతో క్యూలైన్లన్నీ కిక్కిరిసిపోయాయి. కేశ ఖండనశాల దాటి భక్తజనం బారులు దీరారు. గంటల కొద్దీ నిరీక్షించిన అనంతరం అమ్మవారిని దర్శించి పులకించి పోయారు. గోముఖీ నది తీరంలో కొందరు పోలమాంబకు పూజలు చేసి మొక్కుబడులు చెల్లించుకు న్నారు. అనంతరం వనం గుడి వద్ద అమ్మవారు భూ స్థాపితమైన చెట్టుకు పూజలు చేశారు. ఇంకొందరు శంబర తోటల్లోనే వంటలు చేసుకొని భోజనాలు చేశారు. సాలూరు డిపో నుంచి పది బస్సులను శంబరకు నడిపారు. ప్రైవేట్ వాహనాలను గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలోని పార్కింగ్ ప్రదేశాల్లో నిలిపివేయడంతో మండుటెండలో భక్తులు నడిచి ఆలయానికి చేరుకోవాల్సి వచ్చింది. జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భద్రత విధులు నిర్వహించారు.



క్యూలైన్లతో వేచి ఉన్న భక్తులు



శంబర పోలమాంబ

ఎన్నికల ఏర్పాట్లపై అలసత్వం వద్దు

- అధికారులకు ఆర్డీవోల సూచన

గరుగుబిల్లి, ఫిబ్రవరి 20 : సార్వత్రిక ఎన్నికల ఏర్పాట్లలో అలసత్వం వహించరాదని పార్వతీపురం, పాలకొండ ఆర్డీవోలు కె.హేమలత, రమణ సూచించారు. మంగళవారం ఉల్లిభద్రలో వైఎస్ఆర్ ఉద్యాన కళాశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లాకు సంబంధించి నాలుగు నియోజకవర్గాలకు చెందిన ఓట్ల లెక్కింపుతో పాటు తదితర కార్యక్రమాలు ఈ ప్రాంతంలో నిర్వహించేందుకు అనుమతులు మంజూరు చేశారన్నారు. ఈ మేరకు ముందస్తుగా స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ నిర్వహణ, వాహనాల పార్కింగ్‌కు కేటాయించిన స్థలం, పలు గదులను తనఖీ చేశామని తెలిపారు. ఈ ప్రాంతం అన్నింటికీ అనుకూలంగా ఉండటంతో రూట్ మ్యాప్‌లు, భవన సము దాయాలు సమాచారాన్ని ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు వారు వివరించారు. నాలుగు నియోజకవర్గాల్లోని అధికారులు ఎన్నికల నిర్వహణ విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించ రాదని తెలిపారు. ఎప్పటికప్పుడు పూర్తిస్థాయిలో సమాచారం అందించడంతో పాటు అందుబాటులో ఉండాలని సూచించారు.

ఆశ్రమ పాఠశాల విద్యార్థిని మృతి

- శోకసంద్రంలో తల్లిదండ్రులు

పాచిపెంట, ఫిబ్రవరి 20 : మండలంలోని సరాయివలస ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థిని పుంగారి అనిత (14) విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. గిరిశిఖర గ్రామం కొండమోసూరుకు చెందిన బాలిక సరాయివలస ఆశ్రమ పాఠశాలలో 9వ తరగతి చదువుతుంది. ఈ నెల 14న రజస్వల కావడంతో తల్లిదండ్రులు బాలికను స్వగ్రామానికి తీసుకు వెళ్లారు. ఈ నెల 17న పాఠశాల ఏఎన్ఎం విద్యార్థిని సమాచారం కోసం ఫోన్ చేయగా అధిక రక్తస్రావం, ఆయాసంతో బాధపడుతుందని తల్లిదండ్రులు చెప్పారు. వెంటనే ఏఎన్ఎం ఆటోలో కొండమోసూరుకు చేరుకుని అనితను పరిశీలించి.. గురువునాయుడుపేట పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. అయితే మెరుగైన వైద్యం కోసం సాలూరు ఏరియా ఆసుపత్రికి వెళ్లారు. పరిస్థితి మెరుగవకపోవడంతో వెంటనే విజయనగరం ఘోషాసుపత్రికి తరలించగా అక్కడి నుంచి విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ బాలిక మృతి చెందింది. కొండమోసూరుకు చెందిన పుంగారి జోగమ్మ, ఆదయ్యలకు నలుగురు ఆడపిల్లలు. వారిలో అనిత ఆఖరి అమ్మాయి కావడంతో అల్లారు ముద్దుగా పెంచుకున్నారు. అయితే బాలిక మృతితో వారు భోరున విలపిస్తున్నారు. తోటి విద్యార్థులు కూడా ఈ విషయాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. విద్యార్థిని స్వగ్రామంలో విషాదం అలముకుంది.

మీడియాపై దాడి చేయడం దుర్మార్గం

● 'ఆంధ్రజ్యోతి' ఫోటోగ్రాఫర్‌పై వైసీపీ నాయకుల చర్యకు నిరసన ● ఖండించిన జర్నలిస్టులు, పలు సంఘాలు, టీడీపీ నాయకులు

బొబ్బిలి, ఫిబ్రవరి 20: అనంతపురం జిల్లా రాప్తాడు 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫోటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకలు అమానుషంగా దాడి చేయడంపై బొబ్బిలి జర్నలిస్టుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక గాంధీ విగ్రహం ముందు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ నిరసనలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులతో పాటు అన్ని రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు. సీనియర్ జర్నలిస్టు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైఖరిని వక్తలు తప్పుబట్టారు. దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. ● వైసీపీ సిద్ధం సభను చిత్రీక రిస్తున్న రాప్తాడు ఫోటోగ్రాఫర్ శ్రీకృష్ణపై జరిగిన దాడి చాలా అమాను షం.. పార్టీలకు అతీతంగా మానవజన్మ ఎత్తిన ప్రతి ఒక్కరూ ఈ దాడిని ఖండించాలని బేబీనాయన అన్నారు. ఈ రాష్ట్రంలో లా అండ్ ఆర్డరు బతికి ఉందా? లేదా?, సోషల్ మీడియాలో చిన్న పోస్టు పెట్టినా... వారిని వెంటనే అరెస్టు చేసి జైల్లో పెడతారు కానీ శ్రీకృష్ణపై దాడి జరిగి రెండు రోజులవుతున్నా ఇంతవరకు ఎటువంటి చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. దీనిపై కేంద్ర హోం మంత్రిత్వ శాఖ స్పందించాలని బేబీనా యన కోరారు. ● బొబ్బిలి పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు రాంబా ర్కి శరత్‌బాబు, సీపీఎం నేత పొట్నూరు శంకరరావు, కాంగ్రెస్ నేత ముద్దల శ్రీనివాస రావు, లోక్‌సత్తా జిల్లా పార్టీ అధ్యక్షుడు ఆకుల దా మోదరరావు, సీని యర్ జర్నలిస్టు చుక్క జగన్మోహనరావు తదితరులు ప్రసంగిస్తూ ఈ అమానుష దాడిని ఖండించారు. ప్రింట్ అండ్ ఎల క్ట్రానిక్ మీడియా ప్ర తినిధులు రుంకాన రమేష్, పాలవలస ఆదినారా యణ, మహ్మద్ రఫీ, చంద్ర, ఆచారి ఆదినారాయణ, శంకర్, నాయుడు, ర మేష్, రాజు, శ్రీనివా స్, మూర్తి, చలం, గణేశ్, కళాసీ సంఘం నాయకులు, మున్సిపల్ కౌన్సిల ర్లు తదితరులు పాల్గొన్నారు. ● **పార్వతీపురం, ఆంధ్రజ్యోతి:** ఆంధ్ర జ్యోతి ఫోటోగ్రాఫర్‌పై దాడికి నిరసనగా జిల్లాలోని కురుపాం, జియ్యమ్మవలస తదితర మండలాల్లో జర్నలిస్టులు ఆందోళన కార్యక్రమాలు చేపట్టి, అధికారులకు వినతిపత్రాలు అందించారు. ● **జియ్యమ్మవలస:** స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు స్థానిక విలేకర్లు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలియజేశారు. అనంతరం తహసీల్దార్ డీవీ సీతారామయ్యకు వినతిప్రతం అందజేశారు. ● **సాలూరు రూరల్:** రాప్తాడ్‌లో ఆంధ్రజ్యోతి అనంతపురం స్టాఫ్ ఫోటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి చేసిన గుండాలను తక్షణమే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జలుమూరి మణికుమార్, పార్టీ నేత డొంకాడ దా మోదర్ మంగళవారం డిమాండ్ చేశారు. ఈ విషయమై పోలీసులు తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. శ్రీకృష్ణపై దాడి చేసిన ముష్కరులపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు డిమాండ్ చేశారు. ● **దాసన్నపేట:** రాష్ట్రంలో వైసీపీ నేతల అరాచకాలు రోజురోజు కూ పెచ్చు మీరుతున్నాయని వారికి వ్యతిరేకంగా వ్యవహరించే వారిపై దాడులకు పాల్పడుతూ రాక్షస పాలన చేస్తున్నారని జనసేన నాయకులు గురాన అయ్యలు అన్నారు. మంగళవారం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అంతపురం జిల్లా రాప్తాడు నియోజకవర్గం వైసీపీ సభలో ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడికి పాల్పడటం హేయమైన చర్య అన్నారు. అలాగే మంగళవారం కర్నూలు ఈనాడు కార్యాలయంపై దాడి చేసి తమకు అడ్డు వచ్చిన వారందరినీ వైసీపీ దాడులకు పాల్పడుతూ పెట్రేగి పోతున్నారన్నారు. మీడియాపైనే దారుణాలు దిగుతుంటే సామాన్యులకు రక్షణ ఎక్కడ ఉంటుందన్నారు. తక్షణమే దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పాల్గొన్నారు.


బొబ్బిలి: గాంధీబొమ్మ ఎదుట నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న బేబీనాయన


మాట్లాడుతున్న గురాన అయ్యలు


కురుపాంలో..


గుమ్మలక్ష్మీపురంలో..


జియ్యమ్మవలసలో..

ఎడ్ల బండిని ఢీకొన్న లారీ

● ఎద్దు మృతి.. వ్యక్తికి గాయాలు

కొమరాడ, ఫిబ్రవరి 20: నాగావళి నది నుంచి ఇసుకను తీసుకుని వచ్చేందుకు వెళుతున్న ఎడ్ల బండిని మండలంలోని విక్రాంపురం సమీపంలో వెనుక నుంచి లారీ ఢీకొనడంతో ఎద్దు మృతి చెందింది. దీనిపై కొమరాడ ఎస్ఐ నీలకంఠం అందించిన వివరాలిలా ఉన్నాయి. మంగళవారం వేకువ జామున పార్వతీపురం మండలం కృష్ణపల్లి గ్రామానికి చెందిన సింహాచలం ఎడ్ల బండిని తోలుకుంటూ వస్తున్నాడు. అదే సమయంలో రాయగడ వైపు వెళుతున్న లారీ ఎడ్ల బండిని ఢీకొట్టింది. ఈ ఘటనలో ఎద్దు అక్కడికక్కడే మృతి చెందింది. ఎడ్ల బండిని నడుపుతున్న నాగిరెడ్డి సింహాచలం గాయాలపాలయ్యాడు. వెంటనే పార్వతీపురం జిల్లా కేంద్రాసుపత్రికి క్షతగాత్రుడిని తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నీలకంఠం తెలిపారు.

అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

విజయనగరం క్రైం: గంట్యాడ మండలం పెదవేమలి గ్రామ శివార్లలో అక్రమంగా మద్యం రవాణా చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 148 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు సెబ్ ఇంటెలిజెన్స్ వింగ్ విజయనగరం సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. అక్రమంగా మద్యం తరలిస్తున్న గేదేల సన్యాసినాయుడును మంగళవారం అదుపులోకి తీసుకుని మద్యం తరలిస్తున్న వాహనాన్ని కూడా సీజ్ చేసి సెబ్ విజయనగరం రూరల్ స్టేషన్‌కు అప్పగించినట్టు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో హెచ్‌సీ భాష, పీసీలు రవి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నట్టు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

నెల్లిమర్ల: వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన జరజాపుపేటలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ డి.రామగణేష్ తెలిపిన వివరాల ప్రకారం.. జరజాపుపేట దళిత కాలనీకి చెందిన కింతాడ లక్ష్మి(38) తన స్వగృహంలో మంగళవారం ఉరి వేసుకుని, మృతిచెందింది. ఈ మేరకు మృతురాలి సోదరుడు డెంకాడ మండలం, గుండాలపేటకు చెందిన ములపర్తి సన్యాసిరావు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. భర్తతో కలహాల కరాణంగా కలత చెంది లక్ష్మి ఆత్మహత్య చేసుకున్నట్టు సన్యాసిరావు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

హైకోర్టు ఆదేశాలతో ఆగిన అక్రమ నిర్మాణాలు

రామభద్రపురం: మండల కేంద్రంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని హైకోర్టులో పిటిషన్ వేయ డంతో రెవెన్యూ అధికారులు మంగళవారం నిర్మాణాలను నిలిపివేశారు. సుమారు పది కోట్ల విలువ చేసే ఈ భూమి ని స్థానికంగా ఉన్న వైసీపీ నాయకులు ఆక్రమించి వాటిని ప్లాట్‌లుగా విభజించారు. దీనిపై జనసేన నాయకుడు మహంతి ధనుంజయరావు హైకోర్టులో పిటిషన్ వేయ డంతో ఆ భూమిపై ఎటువంటి నిర్మాణాలు వద్దని ఆదేశాలు జరీ చేసింది. కానీ మంగ ళవారం ఆ భూమివద్ద షిపింగ్ కాంప్లెక్స్ కోసం గోతులు తవ్వడంతో స్థానిక తహసీ ల్దార్ ఆకుల సులోచనరాణికి ఫిర్యాదు చేశారు. వెంటనే ఆమె ఆర్ఐ, వీఆర్వో పోలీసు లను పంపించి నిర్మాణాలు నిలుపుదల చేసి, ఈ స్థలం కోర్టు పరిధిలో ఉం దవని, ఎ టువంటి నిర్మాణాలు వద్దన్నారు. జిల్లాకు చెందిన వైసీపీ నాయకుడి ఆదేశాలతో ప్రభు త్వ భూమిని ఆక్రమించి ప్లాట్లు వేశారని ఆరోపణ ఉన్నాయి. దీంతో స్థానిక అధికారు లు కూడా ఈ వ్యవహారంపై చూసీచూడనట్టు ఉంటున్నారు. దీనిపై గత కొన్ని నెలలుగా జనసేన, కమ్యూనిస్టులు పోరాడి, హైకోర్టును ఆశ్రయించారు.

పోక్సో కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు

విజయనగరం క్రైమ్: స్థానిక బొందెలగూడెం గెడ్డ వీధికి చెందిన లారీ క్లీనర్ చందక శ్రీనివాసరావుకు పోక్సో కేసులో మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.రెండు వేల జరిమానా విధిస్తూ న్యాయాధికారి కె.నాగమణి మంగళవారం తీర్పునిచ్చినట్లు దిశ మహిళా పోలీస్ స్టేషన్ సీఐ బి .నాగేశ్వరరావు తెలిపారు. లారీ క్లీనర్ చందక శ్రీనివాసరావు 2021 జూలై 28న ఒక బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినట్లు దిశ పోలీస్ స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు. అప్పటి మహిళా ఎస్ఐ కేటీఆర్ లక్ష్మి కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నిందితుడిని అరెస్టు చేసి న్యాయ స్థానంలో అభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. నిందితునిపై నేరారోపణలు రుజువు కావడంతో పోక్సో కోర్టు న్యాయమూర్తి కె. నాగమణి శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారని సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

బెలగాం: రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలైన ఘటన మంగళవారం పార్వతీపురం మండలం వెంకంపేట వద్ద చోటు చేసుకుంది. ఔట్‌పోస్టు పోలీసుల వివరాల ప్రకారం పార్వతీపురం నుంచి బొండపల్లి వెళుతున్న గుర్తు తెలియని ట్రాక్టర్ పార్వతీపురం మండలం వెంకంపేటకు చెందిన కటారి కృష్ణ(36) సైకిల్ పై వెళ్తుండగా వెంకంటపేట వై జంక్షన్ వద్ద ఢీ కొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. ట్రాక్టర్ డ్రైవర్ సైకిల్‌ను ఢీ కొట్టి ఆపకుండా వెళ్లిపోయారు. స్థానికులు క్షతగాత్రుడిని పార్వతీపురం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం విజయనగరానికి రిఫర్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

గాంధీ విగ్రహం ఆవిష్కరణ

విజయనగరం రింగురోడ్డు: నగరంలోని పెద్ద చెరువు రోడ్డు ఎస్‌బీఐ కూడలి వద్ద మహాత్మాగాంధీ విగ్రహాన్ని మంగళవారం రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ ఆవిష్కరించారు. మంగళవారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.60 లక్షల వ్యయంతో గాంధీ విగ్రహం, ఫౌంటెన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జాతి పిత మహాత్మాగాంధీ విగ్రహం నగరానికే తలమానికం అన్నారు.

కాలువల్లో మురుగు తొలగింపు

శృంగవరపుకోట: శృంగవరపుకోట చింతల వీధి కాలువలో పేరుకుపోయిన మురుగును టీడీపీ కార్యకర్తలు కాపుగంటి వాసు, పెదగాడ రాజు, వాకాడ బాలు, సరిపల్లి రామకృష్ణ, భీశెట్టి మోహన్, సతీష్ తొలగించారు. కాలువలో చెత్తాచెదారం పేరుకుపోవడంతో మురుగు నీరు స్తంభించి, రోరడ్డు పైకి వస్తుండడంతో స్వచ్ఛందంగా ముందుకు వచ్చామని పేర్కొన్నారు.

తూర్పు కాపు సంక్షేమ సంఘం ఉపాధ్యక్షునిగా దూబ

రాజాం/రేగిడి: రాజాంకు చెందిన దూబ రాంబాబు ఆలిండియా తూర్పు కాపు సంక్షేమ సంఘ జాతీయ ఉపాధ్యక్షునిగా నియమితులయ్యారు. ఈమేరకు జాతీయ అధ్యక్షులు పిసిని చంద్రమోహన్ మంగళవారం నియామక పత్రాన్ని అందించారు. తనకు అవకాశం కల్పించిన సంఘ జాతీయ, రాష్ట్ర అధ్యక్షులకు రాంబాబు కృతజ్ఞతలు తెలిపారు.

బిందు, తుంపెర సేద్యంతో రైతులకు ప్రయోజనం

కొత్తవలస: బిందు, తుంపర సేద్యం ద్వారా వ్యవసాయం చేసుకుంటే రైతులకు ఎంతో ప్రయోజనం ఉంటుందని ఉద్యానశాఖాధికారి పద్మ తెలిపారు. మంగళవారం మండలంలోని గులివిందాడ గ్రామంలో మామిడి, బొప్పాయి పంటలకు డ్రిప్ ఇరిగేషన్ ఏర్పాటు చేసుకుని వ్యవసాయం చేస్తున్న లబ్ధిదారుని క్షేత్రాన్ని పరిశీలించారు. సాగుపై పలు సూచనలు చేశారు.

అభ్యసనా సామర్థ్యం పెంచేందుకు కృషి

రేగిడి: పిల్లల్లో అభ్యసనా సామర్థ్యాలు పెంచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక బాధ్యత వహించాలని ఎంఈవో వరప్రసాదరావు సూచించారు. మండలంలో పనసలవలస హైస్కూల్‌లో మంగళవారం ప్రాథమిక స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని ఎంఈవో పర్యవేక్షించారు. ఉపాధ్యాయులు తరల్, ఎఫ్ఎల్ఎన్ తదితర కార్యక్రమాలు సమర్థం నిర్వహిస్తూ, తరగతగదిలో పేపర్ కరక్షన్, టీచ్ టూల్, డిక్టేషన్, లౌడ్‌రీడింగ్, తదితర బోధనాకృత్యాలు పాటించాలన్నారు.

ప్రాంతాలను శుభ్రపరుచుకోవాలి

విజయనగరం రింగురోడ్డు: ప్రధాన రహదారుల్లో పారిశుధ్యానికి విఘాతం కలగకుండా వీధి విక్రయదారులు ఎవరి ప్రాంతాలను వారే శుభ్ర పరుచుకో వాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.మల్లయ్యనా యుడు సూచించారు. మంగళవారం ఉదయం నగరం లోని పలు ప్రధాన రహదారులను పరిశీలించా రు. పా రిశుధ్య ప్రక్రియ ఏ విధంగా ఉందో గమనించారు. పరిస్థితుల్లో మార్పులు తీసుకురా వాలని అ క్కడి పారిశుధ్య పర్యవేక్షకులకు ఆదేశించారు.

పారిశుధ్య కార్మికుల సేవలు మరువలేనివి

విజయనగరం రింగురోడ్డు: ప్రజారోగ్యాన్ని కాపాడుతున్న పారిశుధ్య కార్మికుల సేవలు మరువరానివని నగర మేయర్ విజయలక్ష్మి అన్నారు. మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఔట్ సోర్సింగ్, రెగ్యులరైజ్ కార్మికులకు దుస్తులను పంపిణీ చేశారు. నగరపాలక సంస్థ పరిధిలో వున్న 622 మంది పారి శుధ్య కార్మికులకు ఏటా దుస్తులు పంపిణీ చేస్తున్నామన్నారు.

నేడు వివేకానందస్వామి తీర్థం

వేపాడ: మండలంలోని ఆకులసీతంపేట గ్రామ ప్రజల ఆరాధ్య దైవంగా పేరొందుతున్న శ్రీవివేకానంద స్వామి తీర్థమహోత్సవం బుధ, గురువారాల్లో రెండు రోజులు వైభవంగా నిర్వహించనున్నట్టు గ్రామ పెద్దలు, గ్రామ సర్పంచ్ సుంకరి రమణమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి రోజు ప్రత్యేక పూజలు నిర్వహించుకొని మొక్కులు తీర్చుకుంటారని, రెండో రోజైన గురువారం ఎడ్ల పరుగు ప్రదర్శన, గుర్రాల పరుగు పోటీలు, రాత్రికి డ్యాన్స్ బేబీ డ్యాన్స్ కార్యక్రమం నిర్వహించనున్నారన్నారు.

జేఎన్‌టీయూలో సింపోజియం

విజయనగరం రూరల్: జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయంలో వచ్చే నెల 6, 7 తేదీల్లో ఈఐఎస్ఈఎస్-24 సింపోజియంను నిర్వహించనున్నట్టు వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య చెప్పారు. దీనికి సంబంధించిన గోడ పత్రికను కళాశాలలోని ఆడిటోరియంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ జి.జయసుమ, సింపోజియం-2024 చైర్మన్ మణికుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ వి.మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏకపాత్రాభినయంలో బహుమతి

రాజాం: ఆగూరు గ్రామానికి చెందిన సత్యవరపు రాము ఏకపాత్రాభినయం పోటీలో ప్రథమ స్థానంలో నిలిచాడు. కొత్తూరు మండలం నేరుడు గరంద గ్రామంలో ఏకాదశి సందర్భంగా నిర్వహించిన ఈ పోటీలో రాము అర్జునుడిగా ఏకపాత్రాభినయం చేశాడు. ఆయనకు రూ.5 వేల నగదుతో పాటు ప్రసంశా పత్రాన్ని నిర్వాహకులు అందజేశారు. అనంతరం సత్కరించారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

తెర్లాం: మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ దిలీప్‌చక్రవర్తి మంగళవారం పరిశీలించారు. రెవెన్యూ సిబ్బందితో కలిసి ఆయన మండలంలోని ఎంఆర్.అగ్రహారంలోని 252వ పోలింగ్ కేంద్రాన్ని, వెలగవలసలోని 250, 251, రంగప్పవలసలో 249, కూనాయవలసలో 252, 253, జన్నివలసలో 254వ పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. వీఆర్వో నరసింహ నాయుడు, సర్పంచ్ ప్రతినిధి లొట్టి వెంకటరమణ, కార్యదర్శి హైమావతి తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలంటే భయం వద్దు

విజయనగరం దాసన్నపేట: విద్యార్థులు భయాందోళనలు వీడి తుది పరీక్షలకు సిద్ధం కావాలని వన్‌టౌన్ సీఐ డి.వెంకటరావు సూచించారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన ప్రజ్ఞా వికాసం పరీక్షల్లో ఉత్తీర్ణులకు బహుమతులు ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన సీఐ వెంకటరావు మాట్లాడుతూ విద్యార్థులు సమాజం కోసం ఉపయోగపడేలా విద్యను నేర్చుకోవాలన్నారు. ఈశ్వరరావు, జీవీకే జిల్లా కన్వీనరు శ్రీను, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

'జలజీవన్' పనుల పర్యవేక్షణకు కమిటీ

కలెక్టరేట్: జలజీవన్ మిషన్ పనులు పర్యవేక్షించేందుకు జిల్లా స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ నాగలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరించే ఈ కమిటీలో గ్రామీణ నీటి సరఫరా విభాగం ఎస్ఈ, జెడ్పీ సీఈవో, జిల్లా పంచాయతీ అధికారి, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్, డీడబ్ల్యూఎంఏ ప్రాజెక్టు డైరెక్టర్, సమగ్ర శిక్ష ఈఈ, గ్రామీణ నీటి సరఫరా, సహజ వనరుల నిర్వహణ, సమాజాభివృద్ధి రంగంలో నిపుణులు సభ్యులుగా ఉంటారని నీటి సరఫరా విభాగం ఎస్ఈ ఉమాశంకర్ తెలిపారు.

వృద్ధాశ్రమానికి ఆర్థిక సాయం

రాజాం: కొండంపేట గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న వృద్ధాశ్రమానికి సప్తగిరి ఫిల్లింగ్ స్టేషన్ ఎమ్‌డీ కామేశ్వరరావు రూ.25 వేల ఆర్థిక సాయం అందించారు. నిర్వాహకులు శ్రీనివాస్‌కు నగదును అందించారు.

యాదవులకు పదవులు కేటాయించాలి

కలెక్టరేట్: జిల్లా ఉన్న యాదవులకు రాజకీయ పార్టీల్లో ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలంటూ జిల్లాకు చెందిన యాదవులు డిమాండ్ చేశారు. కలెక్ట రేట్ వద్ద 36 గంటలు నిరాహార దీక్ష నిర్వ హించారు. జిల్లా కేంద్రం లోని ఎంఎల్ఏ టిక్కెటు తోపాటు, ఎంఎ ల్‌సీ పదవి కూడా కేటాయించాలంటూ డిమాండ్ చేశా రు. జిల్లాలోని యాదవులు ఎక్కువగా ఉన్నారని రాజ కీయ పార్టీలు సముచిత స్థానం కేటాయించాలని కోరారు.

కల్యాణమస్తుతో బాలికా విద్యకు తోడ్పాటు

● కలెక్టర్ నాగలక్ష్మి


వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్

కలెక్టరేట్, ఫిబ్రవరి 20: రాష్ట్ర ప్రభుత్వం వైఎస్ఆర్ కళ్యాణమస్తు, షాదీ తోఫా పథకాల కింద కులాంతర వివాహ ప్రోత్సాహకాల ద్వారా చేస్తున్న సాయం బాలికా విద్య ప్రోత్సాహానికి, చిన్న వయసులో వివాహాల నిరోధానికి ఉపయోగ పడుతుందని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. వైఎస్ఆర్ షాదీ తోఫా ఆర్థిక సాయాన్ని సీఎం జగన్ మంగళవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ఆన్‌లైన్ ద్వారా జమ చేశారు. 370 జంటలకు రూ.2.35 కోట్లను సీఎం విడుదల చేశారు. వీరిలో 296 మంది బీసీ, ఒక ఓసీ, ఎస్సీ 60, ఎస్టీ 13 జంటలు ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సీ సురేష్‌బాబు, డీసీసీబీ చైర్మన్ వేచలపు చినరామునాయుడు, డీసీఎంఎస్ చైర్మన్ అవనాపు భావన, డీఆర్‌డీఏ పీడీ కళ్యాణ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో నేత్ర వైద్య పరికరాలు


పరికరాలను ప్రారంభిస్తున్న రమణి

విజయనగరం రింగు రోడ్డు, ఫిబ్రవరి 20: ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలోని నేత్ర విభాగంలో మంగళవారం అత్యాధునిక నేత్ర వైద్య పరికరాలను ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ పి రమణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రోగులకు అత్యాధునిక నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఆటో రిఫ్రాక్టోమీటర్, ఇన్ డైరక్ట్ ఆప్తాల్మోస్కోప్, సైన్ అప్తోపోర్, ఆప్లినేషన్ టోనో మీటర్, విజువల్ ఫీడ్స్ తదితర పరికరాలను అందుబాటులోకి తీసుకువచ్చినట్టు తెలిపారు. ఆర్ఎంవో డాక్టరు సురేష్‌బాబు, ఎస్‌పీఎం ప్రొఫెసర్ ఎస్ అప్పలనాయుడు, నేత్ర విభాగం హెచ్‌ఓడీ శివప్రసాద్, సౌజన్య, పీజీ డాక్టర్సు, పారా మెడికల్, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

రామాయణ, మహాభారతాలకు విశిష్ట స్థానం


అపర్ణను సత్కరిస్తున్న లలిత కుమారి

కొత్తవలస, ఫిబ్రవరి 20 : రామాయణ, మహా భారతాలకు విశిష్ట స్థానం ఉందని ప్రముఖ సాహితీవేత్త బులుసు అపర్ణ అన్నారు. చింతలపాలెంలో భీష్మ ఏకాదశి సందర్భంగా మంగళవారం నిర్వహించిన చిట్టిపాప తీర్థాన్ని పురస్కరించుకుని సాహిత్య గోష్టిని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచ దేశాలకు రామాయణం, మహాభారతం మార్గదర్శకాలన్నారు. పాశ్చాత్యులు కూడా మన సంస్కృతీ సంప్రదాయాలకు ఆకర్షితులు అవుతున్నారని తెలిపారు. మహాభారతంలోని వివిధ పర్వాలలోని అంశాలను చర్చించారు. రామాయణ, మహాభారతం, భగవద్గీతల గొప్పదనాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ఈ సందర్భంగా శృంగవరపుకోట టీడీపీ ఇన్‌చార్జి కోళ్ల లలిత కుమారి.. సాహితీవేత్త అపర్ణను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కేబీఏ రాంప్రసాద్, లాలం అర్జునరావు, చింతపాలెం సర్పంచ్ నవీన్, బంగారు ఇమేష్, గొంప దుర్గా ఉమేష్, పీవీ రత్నాజీ, జామి సూర్యనారాయణ పాల్గొన్నారు.

న్యాయం జరిగే వరకు దీక్షలు కొనసాగిస్తాం


జిందాల్ కార్యాలయం వద్ద రిలేదీక్షలు

శృంగవరపుకోట రూరల్, ఫిబ్రవరి 20: 'జిందాల్ కంపెనీ వస్తుందని నమ్మి 16 ఏళ్ల క్రితం భూములు ఇచ్చాం. ఇప్పటి వరకు కంపెనీ రాలేదు. షేర్ నగదు ఇవ్వలేదు. త్వరలో ఈ భూముల్లో వచ్చే పారిశ్రామికవాడలోని సంస్థల్లో మాకు ఉద్యోగాలు ఇస్తారో లేదో తెలియదు. మా డిమాండ్లను యాజమాన్యం పరిష్కరించే వరకు రిలే దీక్షలు చేస్తామ'ని చెబుతూ మంగళవారం కిల్తంపాలెం జిందాల్ కార్యాలయం వద్ద భూ నిర్వాసితులు రిలే దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాసితులు మాట్లాడుతూ ఇక వేచి చూడలేమని జిందాల్ యాజమాన్యం భూములు ఇచ్చిన రైతులకు ఆర్థిక భరోసా ఇవ్వాలని.. త్వరలో ఏర్పాటు చేస్తామన్న కంపెనీల్లో తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. భూ నిర్వాసితుల దీక్షల శిబిరాన్ని ఎంపీపీ సోమేశ్వరరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వార్డు సభ్యులు సందర్శించి... సంఘీభావం తెలిపారు.

ప్రారంభమైన ఖాదర్ వలీ ఉరుసు ఉత్సవం


దర్గాలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం దృశ్యం

విజయనగరం రూ రల్, ఫిబ్రవరి 20: హ జరత్ సయ్యద్ సహీన్ షా బాబా ఖాదర్‌వలీ 66 వ సూఫీ సుగంధ మహో త్సవాలు మంగళవారం ఖాదర్‌నగర్‌లోని ఖాదర్ బాబా దర్గాలో వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు మంగళవారం ఆరు గంటలకు పవిత్ర ఖురాన్ షరీఫ్ పఠనంతో ఉరుసు మహోత్సవం ప్రారంభమైంది. అనంతరం ఖాదర్ బాబా దర్బార్ నుంచి ఖాదర్ బాబా శిష్యులు హజతర్ అతావుల్లా షరీఫ్, తాజ్ ఖాదరీ, బాబా వారి సూఫీ ఆధ్యాత్మిక వారసులైన చీమలపాడు సూఫీ పీఠాధిపతి మొహమ్మద్ ఖ్వాజీ ముయినుద్దీన్, విజయనగరం జిల్లా దర్గా డాక్టరు మొహమ్మద్ ఖలీల్లులా షరీఫ్ షా ఆధ్వర్యంలో భక్తులు అంతా ఫకీరు మేళా నిర్వహించారు. ఈ మేళా అద్భుతంగా సాగింది. ఖాదర్ బాబా దర్గాకు ఊరేగింపుగా వెళ్లి బాబా దివ్య సమాధికి సుగంధ పరిమళ ద్రవ్యాలను, పూలు, గజమాలతో చాదర్ సమర్పణ చేశారు. విశ్వశాంతి కోసం ప్రత్యేక ప్రార్థనల నిర్వహించారు. భారీ లంగర్ ఖానాలో అన్న ప్రసాదాన్ని అందజేశారు. సుగంధ మహోత్సవాలు బుధవారం కూడా జరగనున్నాయి.

హుద్‌హుద్ ఇళ్లు అప్పగించండి


నిరసన తెలియజేస్తున్న సీపీఎం నాయకులు

విజయనగరం దాసన్నపేట, ఫిబ్రవరి 20: నగరంలో పట్టాలు ఇచ్చిన వారికి హుద్ హుద్ ఇళ్లు అప్పగించాలని.. మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు డిమాండ్ చేశారు. హుద్‌హుద్ ఇళ్లు తక్షణమే అప్పగించాలని కోరుతూ గృహ నిర్మాణ శాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం పీడీని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014 హుద్‌హుద్ తుఫాను వల్ల ఇళ్లు కోల్పోయిన 432 మంది పేదలకు 2019లో లంకాపట్టణం వద్ద గృహాలు నిర్మించి... పట్టాలు ఇచ్చారని, నేటికీ మౌలిక సదుపాయాలు కల్పించలేదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం ప్రతినిధులు రమణమ్మ, జగదాంబ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శంబంగి హుందాగా మాట్లాడాలి: బేబీనాయన

బొబ్బిలి: బొబ్బిలి ఎమ్మెల్యే గతంలో టీడీపీలో ఉన్నప్పుడు గాని, ఇప్పుడు వైసీపీలో గాని కేవలం గాలివాటంతో మాత్రమే గెలిచారు తప్ప ఆయన గొప్పతనమేమీ లేదని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బేబీనాయన అన్నారు. స్థానిక దర్బారు మహల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే శంబంగిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వయసు పైబడ్డ ఆయన హుందాగా మాట్లాడకుండా సభ్యతలేకుండా మాట్లాడడం ఏమిటని ప్రశ్నించారు. అలజంగి గ్రామసర్పంచ్ రేజేటిభద్రమ్మబుజ్జి ఇతర పెద్దల ఆధ్వర్యంలో వందలాది మంది వైసీపీ కార్యకర్తలు ఇటీవల టీడీపీలో చేరడం జీర్ణించుకోలేకపోయిన ఎమ్మెల్యే రకరకాల గిమ్మిక్కులు చేస్తున్నారని ఆరోపించారు. నాలుగేళ్ల పది నెలల కాలంలో అలజంగి రైతులు ఎంతగానో ఇబ్బందులకు గురయ్యారని, అక్కడ తోటపల్లి కాలువకు రెండు సార్లు గండి పడితే పట్టించుకోకపోవడంతో ఆ గ్రామస్థులే కాక, తెర్లాం మండలంలో ఏడు గ్రామాలకు సాగునీరందక పంటల సాగు జరగలేదన్నారు. బొబ్బిలి నియోకవర్గానికి చెందిన సంపద అంతా జిల్లాకు చెందిన నేతలు తరలించుకుపోతున్నారని, ఇందుకు ఎమ్మెల్యే పూర్తి సహకారం అందిస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే ఓటమి తప్పదన్నారు. అలజంగి సర్పంచ్ ప్రతినిధి రేజేటి బుజ్జి, గ్రామ టీడీపీ అధ్యక్షుడు రెడ్డి ప్రసాద్, నాయకులు నాని, పైల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌తో సత్వర న్యాయం

రాజాం రూరల్: లోక్ అదాలత్‌ల ద్వారా కక్షిదారులకు సత్వర న్యాయం జరుగుతుందని సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం.బాబు మంగళవారం ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. మార్చి 9న రాజాంలో నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కక్షిదారులకు ఆయన సూచించారు. అదాలత్ ద్వారా పరిష్కరించుకున్న సివిల్ కేసులకు సంబంధించి కోర్టు ఫీజును కక్షిదారులకు వాపస్ ఇవ్వనున్నట్టు జడ్జి బాబు వెల్లడించారు.

24 నుంచి ధ్యాన మందిర వార్షికోత్సవం

రాజాం రూరల్: ఇక్కడి మల్లికార్జున కాలనీలోని గాయత్రీ ధ్యానమందిరం 12వ వార్షికోత్సవాన్ని ఈ నెల 24 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు జాడ రామవెంకట సుబ్రహ్మణ్య శర్మ, రంప సంతోష్ కుమార్ శర్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా సామూహిక కుంకుమ పూజలు, రుద్రహోమం నిర్వహిస్తామని వెల్లడించారు.

ఎన్నికల సమావేశం

శృంగవరపుకోట: శృంగవరపుకోట తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి.మురళీకృష్ణ ఎన్నికల సమావేశం నిర్వహించారు. ఎన్నికల విధులకు అవసరమయ్యే రూట్ మ్యాప్‌ల గురించి ఆరా తీశారు.

సుందరీకరణ పేరుతో ప్రజాధనం దుర్వినియోగం

● కౌన్సిల్ సమావేశంలో నిలదీసిన టీడీపీ కౌన్సిలర్ రాంబార్కి

బొబ్బిలి, ఫిబ్రవరి 20: ప్రజల నుంచి పన్నుల రూపేణా వసూలు చేసిన ధనాన్ని బ్యూటిఫికేషన్ పేరుతో ఖర్చు చేయడం అభ్యంతరకరమని టీడీపీ కౌన్సిలర్ రాంబార్కి శరత్‌బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ చైర్మన్ సావు వెంకటమురళీకృష్ణారావు అధ్యక్షతన మంగళవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో శరత్‌బాబు అధికారులను నిలదీశారు. ఆ సమయంలో వైసీపీ కౌన్సిలర్లు ఇంటి గోవిందరావు, చోడిగంజి రమేష్‌నాయుడు, తెంటు పార్వతి, సవలాపురపు రామకృష్ణ తదితరులు వాదనకు దిగారు. చైర్మన్, అధికారులు చెప్పాల్సిన సమాధానాలు అధికార పార్టీ కౌన్సిలర్లు చెప్పడం... ప్రతి దానికీ అడ్డుపడడం సరికాదని శరత్ అసహనం వ్యక్తం చేశారు. రోజు విడిచి రోజు తాగునీటి సరఫరా జరుగుతోందని చెబుతున్నారని, వాస్తవానికి అలా లేదని అన్నారు. బ్యూటిఫికేషన్ కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాల రంగులు, మ్యూరల్ ఆర్ట్ పెయింటింగ్‌కు జనరల్ ఫండ్ నుంచి రూ.25 లక్షలు కేటాయించడం సరికాదని రాంబార్కి నిలదీశారు. దీనిపై వైసీపీ కౌన్సిలర్లు ఆయనతో వాదనకు దిగారు. మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌ల్లో షాపుల వేలం ప్రక్రియను వాయిదా వేయాలని కౌన్సిలర్లు పట్టుబట్టారు. దీనిపై కూడా వాదన జరిగింది. అనేక షాపుల నుంచి రూ.లక్షల్లో అద్దె బకాయిలు ఎందుకు వసూలు చేయడం లేదని ఇంటి గోవిందరావు తదితరులు నిలదీశారు. సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ గొలగాని రమాదేవి, పార్వతి, టీడీపీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ గెంబలి శ్రీనివాసరావు, కమిషనర్ లాలం రామలక్ష్మి, మేనేజర్ శివప్రసాద్, టీపీఆర్ఓ జగన్మోహన్, టీపీఎస్ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


అధికారులను నిలదీస్తున్న టీడీపీ కౌన్సిలర్ రాంబార్కి శరత్‌బాబు

టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి: డీఈవో

సాలూరు/రూరల్: ఈ ఏడాది పదో తరగతిలో పరీక్షల్లో శతశాతం ఫలితాలు సాధించే విధంగా కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాలని డీఈవో జీపగడాల మ్మ సూచించారు. మంగళవారం ఆమె ఖరాసవలసలో కేజీబీవీని పరిశీలించారు. విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గతేడాదిలా ఈ సారి కూడా పదో తరగతి ఫలితాల్లో జిల్లా ముందుండే విధంగా ఉపాధ్యాయులు శ్రద్ధ చూపాలన్నారు. వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేకంగా క్లాసులు నిర్వహించాలని తెలిపారు. ఒత్తిడితో కాకుండా ఆనందంతో పరీక్షలు రాసే విధంగా కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. అనంతరం నాడు-నేడు పనులను పరిశీలించారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతుల పరిశీలన

సీతంపేట: పోలింగ్ బూత్‌ల పరిశీలనలో భాగంగా మంగళవారం వలగెడ్డ, పెద్దూరు పాఠశాలలను ఎంఈవో-2 సూర్యచంద్రరావు సందర్శించారు. పోలింగ్ బూత్‌కు కావాల్సిన కరెంట్, ఫర్నీచర్, బాత్‌రూమ్‌లు పరిశీలించారు. అనంతరం పెద్దూరు పాఠశాల విద్యార్థులకు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు.

జనసేన స్టిక్కర్ల పంపిణీ

వీరఘట్టం: గ్లాసు గుర్తుకు ఓటు వేసి రానున్న ఎన్నికల్లో జనసేనను గెలిపించాలని పార్టీ నాయకులు గర్భాన సత్తిబాబు కోరారు. ఈ మేరకు మంగళవారం ప్రజలు, విద్యార్థులకు గాజు గ్లాసు స్టిక్కర్లను పంపిణీ చేశారు. జనసేన నాయకులు సతివాడ వెంకటరమణ, వీరఘట్టం మండల నాయకులు పాల్గొన్నారు.

ఒప్పంద ఉపాధ్యాయులకు నష్టం లేకుండా చూడాలి

గుమ్మలక్ష్మీపురం: గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న ఒప్పంద ఉపాధ్యాయులకు ఎటువంటి నష్టం లేకుండా చర్యలు తీసుకోవాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తాడంగి సాయిబాబు, పాలక రంజిత్‌కుమార్ కోరారు. డీఎస్సీలో గిరిజన సంక్షేమ శాఖ పోస్టులు చూపించిన నేపథ్యంలో ఇప్పటికే ఒప్పంద ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న వారికి తమ ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. దీనిపై గిరిజన సంక్షేమ శాఖామంత్రి, ఎమ్మెల్యేలు, ఎంపీ స్పందించాలని కోరారు.

పట్టా ఉంది.. స్థలం వచ్చింది

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: ఇళ్ల స్థలాల పంపిణీలో భాగంగా పట్టా ఇచ్చారు కానీ స్థలం చూపించలేదని సోమవారం జరిగిన స్పందనలో సవరపు ప్రమీల అర్జీ ఇచ్చారు. తక్షణమే సమస్యను పరిష్కరించాలని కలెక్టర్ నిశాంత్ కుమార్.. ఆర్డీవో కె.హేమలతను ఆదేశించారు. ఆమె వెంటనే రంగంలోకి దిగి 24 గంటలు గడవముందే సమస్యను పరిష్కరించి లబ్ధిదారు కుటుంబంలో ఆనందం నింపారు. ప్రమీల పార్వతీపురం మండలం బొండపల్లికి చెందిన వ్యక్తి. పెదబొండపల్లి జగనన్న కాలనీలో ప్లాట్ నెంబరు 54 స్థలాన్ని మంగళవారం అధికారులు అప్పగించారు. కృష్ణపల్లి లేఅవుట్‌లో అన్యాక్రాంతం అవుతుందని అర్జీ పెట్టిన మేరకు రెవెన్యూ అధికారులు స్పందించి మంగళవారం ఆక్రమణలను నిలుపుదల చేశారు. దీనిపై అర్జీదారులు సంతృప్తి వ్యక్తం చేశారు.

శ్రీనివాసులరెడ్డిపై దాడి అప్రజాస్వామికం

కొమరాడ: టీడీపీ తెలుగు రైతు రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డిపై దాడి అప్రజాస్వామికమని అరకు పార్లమెంటు నియోజకవర్గ రైతు అధ్యక్షుడు వెంకటనాయుడు అన్నారు. ఒంగోలులో శ్రీనివాసులరెడ్డిపై కత్తులతో దాడి చేయడాన్ని ఖండిస్తున్నట్టు తెలిపారు. వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడిన నాయకులపై గానీ, మీడియాపై గానీ దాడులు చేయడమే ప్రధాన ఎజెండాగా పెట్టుకున్నట్టు కనిపిస్తుందన్నారు. తక్షణమే దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

పాచిపెంట: రాజకీయ పార్టీలతో ప్రమేయం లేకుండా అందరికీ సంక్షేమ పథకాలు మంజూరు చేశామని డిప్యూటీ సీఎం రాజన్నదొర అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయం వద్ద వలంటీర్లకు సేవా రత్న అవార్డులు అందజేశారు.

సచివాలయాన్ని సందర్శించిన ఎంపీడీవో

సీతానగరం: జోగింపేట గ్రామ సచివాలయాన్ని ఎంపీడీవో ఈశ్వరరావు మంగళవారం సందర్శించారు. ఈసందర్భంగా సిబ్బందితో మాట్లాడి, పనితీరుపై ఆరా తీశారు. హాజరు పట్టిక పరిశీలించారు.

అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విధుల నుంచి తొలగింపు

పాలకొండ: కొత్తూరు మండలంలో 2013లో అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌గా పనిచేసిన పి.శాంతికుమారి ఓ వ్యక్తి నుంచి రూ.2వేలు లంచం తీసుకొని అవినీతి నిరోధక శాఖకు పట్టుబడ్డారు. అనంతరం ఆమెను అరెస్టు చేసి సస్పెండ్ చేశారు. ఆ కేసు కోర్టులో ఉండగా శాంతి కుమారి మళ్లీ విధుల్లోకి చేరారు. ప్రస్తుతం పాలకొండ ప్రాజెక్టులో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న శాంతికుమారి కేసుకు సంబంధించి తాజాగా తీర్పు వెలువడింది. కోర్టు తీర్పు మేరకు పి.శాంతికుమారిని విధుల నుంచి తొలగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

అభివృద్ధిలో యువత పాత్ర కీలకం

పాలకొండ: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యువ సంవాద్ ఇండియా ఏ 2047 కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ 1, 2 ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్యాంబాబు అధ్యక్షతన కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఏ దేశ అభివృద్ధిలోనైనా యువత పాత్ర అత్యంత కీలకమన్నారు. యువత విద్యపై దృష్టి సారించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. అనంతరం యువ సంవాద్ ఇండియా ఏ 2047 అంశంపై పోస్టర్ ప్రెజెంటేషన్, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు.

టిడ్కో ఇళ్ల పంపిణీ

సాలూరు: పట్టణంలోని చంద్రంపేట సమీపంలో నిర్మించిన టిడ్కో ఇళ్లను ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర చేతులమీదుగా మంగళవారం పంపిణీ చేశారు. టిడ్కో ఇళ్ల కోసం 14 ఎకరాల స్థలాన్ని సేకరించామని ఆయన చెప్పారు. 26 బ్లాకులలో 1,228 ఇళ్లను నిర్మించేందుకు పనులు చేపట్టామని తెలిపారు. ప్రస్తుతం 300 చదరపు అడుగుల విస్తీర్ణం ఉన్న 1,052 గృహాలను ప్రస్తుతం పంపిణీ చేస్తున్నామని చెప్పారు. రాష్ట్ర టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ ఇప్పటివరకు రాష్ట్రంలో సాలూరుతో కలుపుకొని 38 పట్టణాల్లో లక్షా 16 వేల మంది లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు ఇచ్చామని తెలిపారు. ఐటీడీఏ పీవో విష్ణుచరణ్, మున్సిపల్ కమిషనర్ ప్రసన్నవాణి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఈశ్వరమ్మ, వైస్ చైర్మన్‌లు దీప్తి, అప్పలనాయుడు, టిడ్కో డైరెక్టర్లు పాల్గొన్నారు.

కల్యాణమస్తు నిధులు విడుదల

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: కల్యాణమస్తు, షాదీతోఫా నిధులను కలెక్టర్ నిశాంత్‌కుమార్ విడుదల చేశారు. 172 మంది నూతన వధూ వరులకు మంజూరైన రూ.కోటి 12లక్షల 90వేల చెక్కుకు లబ్ధిదారులకు అందించారు.

రూ.62 కోట్లతో తాగునీటి పథకం

భామిని: మండలంలో రూ.62 కోట్లతో మల్టీవిలేజ్ జల అభియాన్ పథకం మంజూరయ్యిందని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఢిల్లీశ్వరరావు తెలిపారు. సింగిడి గ్రామం వద్ద వంశధార నదీ తీరాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. అనంతరం మ్యాప్‌ను పరిశీలించారు. ఈ పథకం ద్వారా బురుజోల కొండ శిఖరాన వాటర్ ట్యాంకు ఏర్పాటు చేసి 1.2 లక్షల లీటర్ల సామర్థ్యం ఉన్న ట్యాంకును ఏర్పాటు చేసి అటు బత్తిలి, ఇటు కొరమ వరకు సుమారు 30 కిలోమీటర్ల వరకు 54 గ్రామాలకు మంచినీరు అందించవచ్చని చెప్పారు. ఈ పథకంపై టెండర్లు కూడా ఖరారు అయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభిస్తారని తెలిపారు. ఆయనతో పాటు ఏఈ సందీప్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

రహదారి నాణ్యతా ప్రమాణాల తనిఖీ

సీతంపేట: గిరిజన ఇంజినీరింగ్ శాఖ ద్వారా చేపడుతున్న బందమానుగూడ రహదారి పనులు నాణ్యతా ప్రమాణాలపై తనిఖీ చేసినట్టు ఆ శాఖ క్వాలిటీ కంట్రోల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఏవీఎస్ మూర్తి మంగళవారం తెలిపారు. ఈ రహదారి నాలుగు కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు వేసేందుకు వీలుగా రహదారి పనులు చేపట్టారని చెప్పారు. నిబంధనల మేరకు రహదారి పనులు జరిగాయా.. లేదా.. అనే దానిపై పరిశీలించామన్నారు. ఈ కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ డీఈ రవికుమార్, జేఈ రమేష్, నాగభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

ధ్రువపత్రాలకు అవస్థలు

భామిని: కుల, ఆదాయ ధ్రువపత్రాల దరఖాస్తులకు ప్రజలు అవస్థలు పడుతున్నారని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి సమక్షంలో పలువురు ప్రజాప్రతినిధులు తహసీల్దార్ శ్రీనివాసరావును ప్రశ్నించారు. గతంలో సచివాలయంలో దరఖాస్తులు చేసుకుంటే నేరుగా ధ్రువపత్రాలు మంజూరయ్యాయని, ప్రస్తుతం చెక్‌లిస్ట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ అభ్యంతరాలు వ్యక్తం చేయడం సరికాదన్నారు. దీనిపై తహసీల్దార్ స్పందిస్తూ ధ్రువపత్రాల్లో ఇంటి పేరు మార్పిడి చేసి ధ్రువపత్రాలు అడగడంతో సందేహాలు వచ్చిన వారికి చెక్‌లిస్ట్‌ను అందించి విచారణ చేపట్టడం తప్పదని తెలిపారు. ఇంటి పట్టాలు ఎన్నికల ముందు ఇవ్వకూడదని కలెక్టర్ ఆదేశించారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. భూ వివాదాల్లో మ్యూటేషన్ పెట్టుకోవచ్చునని, పక్కా రిజిస్టర్ ఆధారాలుంటే చేస్తామని తహసీల్దార్ తెలిపారు.

బహిరంగ వేలం ఆరోసారి వాయిదా

పార్వతీపురంటౌన్: రోజు వారి మార్కెట్ ఆశీలు వసూలు బహిరంగ వేలం ఆరోసారి వాయిదా పడింది. మంగళవారం స్థానిక మున్సిప్ కార్యాలయ ఆవరణలో రెవెన్యూ విభాగం ఆర్వో రూబేను ఆధ్వర్యంలో జరిగిన రోజు వారి మార్కెట్ ఆశీలుకు సంబంధించి బహిరంగ వేలం పాటను నిర్వహించారు. ఆశీలు వసూలుకు సంబంధించి సర్కారువారి పాట రూ.23.76లక్షలు నిర్ణయించారు. బహిరంగ వేలంలో పాటదారుల ఎవరూ పాల్గొనకపోవడంతో వాయిదా వేస్తున్నట్టు ఆర్వో తెలిపారు.

'సూపర్ సిక్స్'ను ప్రజల్లోకి తీసుకువెళ్లండి

- పిలుపునిచ్చిన టీడీపీ నాయకులు
- గ్రామాల్లో బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ



భోగాపురం: కిట్లు అందజేస్తున్న కర్రోతు బంగార్రాజు



విజయనగరం రూరల్: కిట్లను అందజేస్తున్న అదితి గజపతిరాజు

భోగాపురం: టీడీపీ సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పార్టీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు అన్నారు. పోలిపల్లి గ్రామంలో మంగళవారం బూత్ ఇన్‌చార్జిలకు సూపర్ సిక్స్ కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నీలాపు అప్పలరామిరెడ్డి, సత్యనారాయణ, కె.దివాకర్, బి.హరిబాబు, తదితరులు పాల్గొన్నారు. ● **విజయనగరం రూరల్:** సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అదితి గజపతిరాజు పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని డివిజన్, మండలంలోని గ్రామ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, బూత్ ఇన్‌చార్జులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడారు. అనంతరం టీడీపీ రాష్ట్ర శాఖ పంపించిన కిట్లను పార్టీ శ్రేణులకు అందించారు. టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, కనకల మురళీమోహన్, ప్రసాదుల ప్రసాద్, ఆల్తి బంగారుబాబు, బొద్దల నర్సింగరావు, గంటా పోలినాయుడు, కంది మురళీనాయుడు, అనురాధ బేగం, కోండ్రు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ● **గంట్యాడ:** కొండతామరాపల్లిలో మంగళవారం టీడీపీ మండల నాయకులు పర్యటించి, సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించా రు. టీడీపీ మండల అధ్యక్షుడు కొండపల్లి భాస్కర్‌నాయుడు, రంది చినరామునాయుడు, మానరపు ఎరుకునాయుడు తది తరులు పాల్గొన్నారు.

ఎం.రాజపురంలో..



మాట్లాడుతున్న జయకృష్ణ

వీరఘట్టం: ఎం.రాజపురం గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పాలకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి నిమ్మక జయకృష్ణ పాల్గొని, మాట్లాడారు. ఇంటింటికి వెళ్లి సూపర్‌సిక్స్ లాభాలను వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు, గ్రామ సర్పంచ్ నిమ్మక రమణమ్మ, తోటపల్లి ప్రాజెక్టు మాజీ చైర్మన్ నిమ్మక పాండురంగ, పార్టీ నాయకులు పొదిలాపు కృష్ణమూర్తినాయుడు, పొన్నాడ నాగేశ్వరరావు, జామి లక్ష్మీనారాయణ, ఉదయాన ఉదయ్‌భాస్కర్, చింత ఉమా, పరిశర్ల వెంకటరమణ, మాచర్ల అనీల్, లింగాల చంటి, రాయిపిల్లి రత్నాకర్, బల్లా హరి, గొర్లె గౌరునాయుడు, సూరప్పలనాయుడు, శంకరరావు, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

200 మంది చేరిక



టీడీపీలో చేరిన వైసీపీ శ్రేణులతో సంధ్యారాణి

పాచిపెంట: సామాన్యుల జీవనానికి ఇబ్బంది లేకుండా టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే నిత్యావసర సరుకుల ధరలు తగ్గిస్తామని పార్టీ పొలిట్ బ్యూరో సభ్యురాలు గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. మంగళవారం గుమ్మిడిగూడ గిరిజన గ్రామంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సుమారు 200 మంది వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. టీడీపీ మండల అధ్యక్షుడు పిన్నింటి ప్రసాద్‌బాబు ఆధ్వర్యం లో సంధ్యారాణి వారికి కండువాలు వేసి, పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ముఖి సూర్యనారాయణ, కొత్తల పోలి నాయుడు, ఈదు బిల్లి తిరుపతిరావు, కోరిపల్లి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన ప్రభుత్వంతోనే అభివృద్ధి



పథకాలను ప్రచారం చేస్తున్న విజయచంద్ర

పార్వతీ పురం, ఆంధ్ర జ్యోతి: తెలుగు దేశం, జనసేన పార్టీ ప్రభుత్వం తోనే రాష్ట్ర అభివృద్ధి ముడి పడి ఉందని టీడీపీ నియోజక వర్గ ఇన్‌చార్జి విజయచంద్ర తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆరో వార్డులో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాలపై వివరించారు.

భక్తిశ్రద్ధలతో భీష్మ ఏకాదశి

పార్వతీపురంటౌన్: భీష్మా ఏకాదశి పర్వదినాన్ని జిల్లా కేంద్రంలోని పలు దేవాలయాల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీరామ సత్యనారాయణస్వామి ఆలయంలో ఉదయం 5 గంటల నుంచి భక్తులకు దర్శనం కల్పించారు. ఈవో ప్రసాదు ఆధ్వర్యంలో సామూహిక సత్యదేవుని వ్రతాలు జరిగాయి. బెలగాం శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



సామూహిక సత్యవ్రతాల్లో పాల్గొన్న దంపతులు

కుంబిడిలో జనసేన-గిరిసేన



జనసేన-గిరిసేన నిర్వహిస్తున్న దృశ్యం

వీరఘట్టం: కుంబిడి గ్రామంలో మంగళవారం జనసేన-గిరిసేన కార్యక్రమం నిర్వహించారు. ఉత్తరాంధ్ర జనసేన నాయకులు బీపీ నాయుడు, నిమ్మల నిబ్రమ్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన అభ్యర్థిని గెలిపించాలని కోరారు. వైసీపీ ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తోందన్నారు. తాజాగా జర్నలిస్టులపై కూడా దాడులకు దిగుతున్నారన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు, పవన్ ప్రభుత్వం రావాలన్నారు. ఈ కార్యక్రమంలో మత్స పుండరీకం, జానీ, గౌరు, నందివాడ పండు, సాయిపవన్, అచ్యుత్ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలల మంజూరు సరే.. వసతులేవీ?

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: జిల్లాలోని 15 మండలాలకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలను మంజూరు చేస్తున్నట్లుగా సర్కారు ఉత్తర్వులు జారీ చేసింది. మండలానికొకటి చొప్పున ఏర్పాటు చేయాలని ఆదేశాలిచ్చింది. కొన్ని మండలాల్లో హైస్కూళ్లను అప్‌గ్రేడ్ చేస్తూ వాటిని కళాశాలగా మార్చనున్నారు. అయితే కళాశాలలకు సంబంధించిన మౌలిక వసతులు , ల్యాబ్స్, బోధన సిబ్బంది తదితర వాటిపై దృష్టి ఎప్పుడు సారిస్తారో వేచి చూడాల్సి ఉంది.

ఆందోళనకు సంఘీభావం

పాలకొండ: ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం శ్రీకాకుళంలో చేపడుతున్న ఆందోళన కార్యక్రమంలో పాలకొండ జేఏసీ నాయకులు మంగళవారం పాల్గొన్నారు. వారి నిరసనకు మద్దతు తెలిపారు. డివిజన్ గౌరవాధ్యక్షుడు లిల్లీ పుష్పనాథం, అధ్యక్షుడు రంగాచార్యులు, కార్యదర్శి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'అంబేడ్కర్ భవనం నిర్మించి తీరుతాం'

పాలకొండ: పట్టణంలో అంబేడ్కర్ భవనం నిర్మించి తీరుతామని దళిత సంఘాలు, అంబేడ్కర్ ఆశయ సాధన సమితి జిల్లా నాయకుడు బత్తిన మోహన్‌రావు అన్నారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కళావతి స్పందించి అంబేడ్కర్ భవనం, ఎస్సీ, ఎస్టీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సహకరించాలని కోరారు. డివిజన్ అధ్యక్షుడు గురువు రవికుమార్, దళిత యువసేన సభ్యులు రమేష్, అనిల్, రాజ్‌కుమార్, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

సవర భాషలోనే విద్యాబోధన కొనసాగాలి



నిరసన తెలుపుతున్న దృశ్యం

సీతంపేట: సవర భాషలోనే గిరిజన విద్యార్థు లకు ప్రాథమిక విద్యాబోధన కొనసాగాలని సవర భాషా వలం టీర్ల రాష్ట్ర ఉపాధ్యక్షుడు సవర డొంబు డిమాండ్ చేశారు. మంగళవారం మొగదారగూడ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి, ఏప్రిల్ నెల కూడా సవర భాషా వలంటీర్లను కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ సవర శ్రీను, వార్డు మెంబర్లు బంగారు, గయారమ్మ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవు

గరుగుబిల్లి: ఉపాధి హామీ పథకంలో నూతన నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని సీతంపేట క్లస్టర్ ఏపీడీ గుంట్రెడ్డి శ్రీహరిరావు హెచ్చరించారు. గరుగుబిల్లి, పెద్దూరు, రావుపల్లి గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉపాధి పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. వేతనదారుల సంఖ్య తక్కువగా ఉండటంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులకు హాజరయ్యే వారికి విధిగా రెండు పూటలా ఫొటోలు తీయాలన్నారు. రాని వారికి మస్తరు వేయకూడదన్నారు. ఏపీవో ఎం.గౌరీనాథ్, ఈసీ డి.శ్రీనివాసరావు, క్షేత్ర సహాయకుడు జి.శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంగాదేవి సంబరాలు

పార్వతీపురంటౌన్: పట్టణ శివారులోని అగ్రహారం వద్ద బత్తులవారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో మంగళవారం గంగాదేవి సంబరాలు ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

'సురక్ష'కు స్పందన కరువు



ఆరోగ్య సురక్షలో రోగులు లేని దృశ్యం

గరుగుబిల్లి: తోటపల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించిన రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్షకు స్పందన కరు వయ్యింది. ఈ కార్యక్రమంలో అధికారులే అధికంగా దర్శనమిచ్చారు. రోగులు ఆచూకీ లేని పరిస్థితి కనిపించింది. ఆరోగ్య సురక్ష మొదటి విడతలో అంతంతగానే ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో కార్యక్రమంపై అధికా రుల్లో ఆసక్తి తగ్గినట్టు తెలుస్తోంది. రెండో విడతకు నిధులు మంజూరు చేస్తామ న్న ప్రభుత్వం నేటికీ విడుదల చేయకపోవడంతో సచివాలయ కార్యదర్శులు, సిబ్బందికి చేతి చమురు వదులుతుంది. ప్రచారానికే తప్ప ప్రజలకు ఉపయో గపడేది లేదని పలువురు పెదవి విరుస్తున్నారు.

బహిరంగ ప్రకటన చేయాలి

పాలకొండ: పట్టణంలోని డిగ్రీ కళాశాల వెనుక ఆసుపత్రి రోడ్డులో సర్వే నెంబర్ 20 (1)(2)లో 30 సెంట్ల భూమి ప్రస్తుత పరిస్థితులు, దాని స్వభావంపై రెవెన్యూ అధికారి, యంత్రాంగం బహిరంగ ప్రకటన చేయాలని సీపీఎం నేత దావాల రమణారావు డిమాండ్ చేశారు. మంగళవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రమణారావు, కాద రాము మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఎటువంటి ఇళ్ల నిర్మాణం లేనప్పుడు మద్దెల చిట్టి అప్పడుకు వ్యవసాయ భూమి కింద ఇచ్చారన్నారు. కొంతమంది బినామీ పట్టాలు చేయించుకొని అమ్ముకుంటున్నారని ఆరోపణలు వస్తున్నాయన్నారు. వారం రోజుల్లో రెవెన్యూ యంత్రాంగం భూమి స్వభావాన్ని బహిరంగంగా ప్రజలకు తెలియజేయాలని కోరారు.

డయల్ యువర్ డీపీటీవోకు సమస్యల వెల్లువ

పార్వతీపురంటౌన్: స్థానిక ఆర్టీసీ జిల్లా ప్రజారవాణా అధికారి కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన డయల్ యువర్ డీపీటీవో కార్యక్రమంలో ప్రజలు పలు సమస్యలను విన్నవించుకున్నారు. డీపీటీవో సుధాకర్ ఫోన్ ద్వారా సమస్యలను తెలుసుకున్నారు. పార్వతీపురం మండలం కవిటిభద్ర గ్రామంలో పాఠశాలల విద్యా ర్థుల కోసం ఆర్టీసీ బస్సును నడపాలని ఆ గ్రామానికి చెందిన సుధీర్‌బాబు కోరారు. అలాగే పార్వతీపురం నుంచి కొమరాడ మండలంలోని కూనేరు వరకు ప్రతి రోజు ఉదయం 8 గంటలకు ఆర్టీసీ బస్సు నడపాలని ఉపాధ్యాయురాలు విజయలక్ష్మీ విన్న వించుకున్నారు. పార్వతీపురం నుంచి వీరఘట్టాం, పాలకొండ, శ్రీకాకుళం వెళ్తున్న ఆర్టీసీ బస్సులు మండలంలోని అడ్డాపుశీల వద్ద ఆపడం లేదని ఆ గ్రామానికి చెందిన మన్మథరావు తెలిపారు. మక్కువ మండల కేంద్రం నుంచి విశాఖ పట్టణానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని, ఆ గ్రామానికి చెందిన కృష్ణం నాయుడు కోరారు. జిల్లా కేంద్ర శివారుల్లో ఉన్న వైకేఎం కాలనీ వద్ద అల్ట్రా డీలక్స్ బస్సులు ఆపడం లేదని, ఆ కాలనీకి చెందిన రామసూర్యారావు చెప్పారు. పార్వతీపురం మండలంలోని వెలగ వలసకు బస్సు సౌకర్యం కల్పించాలని, సాలూరు నుంచి రోజు సింహాచలం పుణ్య క్షేత్రానికి బస్సులు నడపాలని డీపీటీవోను కోరారు.

నేడు వాహనాలకు వేలం పాట

మక్కువ: వివిధ కేసుల కింద సీజ్ చేసిన 8 వాహనాలకు బుధవారం వేలంపాట నిర్వహించనున్నట్టు ఎస్‌ఐ పి.నరసింహమూర్తి తెలిపారు. ఆసక్తిగల వారు పోలీసు స్టేషనులో సంప్రదించాలని కోరారు.

కలశాలతో ఊరేగింపుగా..

పాలకొండ: పట్టణంలోని ఎన్.కె.రాజపురంలో మంగళవారం కోదండరామస్వామి ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం చేపట్టారు. పట్టణంలో మహిళలు కలశాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. దీంతో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది.



43 అర్జీల స్వీకరణ

రాయగడ: జిల్లా యంత్రాంగం బిసమ్‌కటక్ సమితిలో వినతుల స్వీకరణ కార్యక్రమం చేపట్టింది. మొత్తంగా 43 మంది అర్జీదారులు తమ సమస్యలను కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్ దృష్టికి తెచ్చారు. వాటిలో 39 వ్యక్తిగత సమస్యలు కాగా.. 4 సామూహిక ఫిర్యాదులు ఉన్నాయి. వాటిని పరిశీలించిన కలెక్టర్ ఓ వ్యక్తికి సీఎం సహాయనిధి నుంచి రూ.రెండు వేలు అందజేశారు. వివిధ సమస్యలపై గతంలో వినతులు అందించిన అర్జీదారులకు చెక్కులు అందజేశారు. ఇతర అర్జీలను సకాలంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

హామీలు నెరవేర్చండి

రాయగడ: కేంద్ర ప్రభుత్వం గతంలో తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఉత్కళ దీదీలు డిమాండ్ చేశారు. గృహిణుల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఉజ్వల పథకం నిర్వహణను ఉత్కళ దీదీలకు అప్పగించారు. వారు ఉజ్వల పథకం ద్వారా పల్లె ప్రజలకు గ్యాస్ కనె క్షన్లు అందజేశారు. ఇంత చేసినా తమకు గుర్తింపు లభించలేదని... ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని వారు ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం భారతీయ మజ్దూర్ సంఘం జిల్లా అధ్యక్షుడు జోగేశ్వర దాస్ నేతృత్వంలో ర్యాలీగా వెళ్లి తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అదనపు కలెక్టర్ భాస్కరచంద్ర రౌయిత్‌కు వినతిపత్రం అంద జేశారు. ఈ కార్యక్రమంలో ఉత్కళ దీదీ సంఘ రాష్ట్ర అధ్యక్షురాలు బీనా పాణి బెహరా, మజ్జి మోహనరావు, గణేష్ కుమార్‌దాస్ పాల్గొన్నారు.